సాక్షి
మెదక్
గురువారం । 17 । జూలై । 2025



దర్యాప్తు ముమ్మరం

కాంగ్రెస్ నాయకుడు అనిల్ హత్య ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

వివరాలు 8లో ▸



ఆర్థికంగా బలోపేతం కావాలి

స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు.

వివరాలు 9లో ▸

నేడు మెదక్‌కు పీసీసీ చీఫ్ రాక

మెదక్‌జోన్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ గురువారం మెదక్ రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు భారీ ఎత్తున పార్టీలో చేరుతారని అన్నారు. ఈమేరకు జిల్లాకు చెందిన పలువురు నాయకులు బుధవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలిసి చర్చించారు.

న్యూస్‌రీల్

అటవీ భూమి కబ్జా



కబ్జాకు గురైన అటవీ భూమిని పరిశీలిస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): ఐదెకరాల మేర అటవీ భూమిని కబ్జా చేసిన గిరిజనులను అదుపులోకి తీసుకున్న ఆశాఖ అధికారులు సదరు భూమిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పర్వతాపూర్ పంచాయతీ పరిధిలో బాపనయ్య తండాకు చెందిన కొందరు తండాను ఆనుకొని ఉన్న అటవీ భూమిపై కన్నేశారు. రాత్రి సమయంలో ట్రాక్టర్లు, జేసీబీలతో చెట్లను తొలగించి సదరు భూమిని చదును చేశారు. సమాచారం అందుకున్న మెదక్ అటవీశాఖ రేంజ్ అధికారి మనోజ్‌కుమార్, డిప్యూటీ రేంజ్ అధికారి ఖుద్బొద్దీన్ తమ సిబ్బందితో వెళ్లి కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. చెట్లను తొలగించి అటవీ భూమిని కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు వారితోనే మళ్లీ మొక్కలు నాటిస్తామని చెప్పారు. కాగా అటవీశాఖ అధికారులు ఇద్దరు గిరిజనులను అదుపులోకి తీసుకొని మెదక్ తరలిస్తుండగా, గిరిజనులు కొందరు అడ్డుకున్నారు. దీంతో వారిని సముదాయించారు. ఎవరైనా అక్రమంగా అటవీ భూములు కబ్జా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీరాం

చేగుంట(తూప్రాన్)/చిన్నశంకరంపేట(మెదక్)/రామాయంపేట: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ శ్రీరాం అన్నారు. బుధవారం చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఆశావర్కర్లు, సిబ్బంది గ్రామాల్లో సందర్శించి ఎప్పటికప్పుడు ఆరోగ్య సంబంధిత వివరాలను సేకరించాలన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ నవ్య, మెడికల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చిన్నశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అలాగే రామాయంపేట మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న పీఆర్టీయూ నాయకులు

హవేళిఘణాపూర్(మెదక్): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు పీఆర్టీయూ టీఎస్ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్ల శ్రీనివాస్, సామ్యానాయక్ అన్నారు. బుధవారం మెదక్ మండల పరిధిలోని మాచవరం, మంభోజిపల్లి, రాజుపల్లి, మక్తభూపతిపూర్ తదితర పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పీఆర్టీయూ టీఎస్ ముందు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు శ్రీనివాస్, గోపిచంద్, సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, సతీశ్‌రావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

19న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

మెదక్‌జోన్: ఈనెల 19వ తేదీన జిల్లాస్థాయి జూనియర్, సీనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 ఏళ్లలోపు బాల, బాలికలకు అవకాశం ఉంటుందన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు వచ్చేనెల 3, 4వ తేదీలలో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కాగా ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణపత్రం తీసుకురావాలని సూచించారు.

కంకర పరిచి.. రోడ్డు మరిచి

నాలుగు జిల్లాలతో అనుసంధానమైన ప్రధాన రహదారి మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఏడాదిన్నరగా కంకర పరిచి వదిలేయడంతో రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– రామాయంపేట/నిజాంపేట(మెదక్)

- అసంపూర్తిగా నాలుగు జిల్లాల అనుసంధాన రహదారి
- 18 కిలోమీటర్లకు కేవలం నాలుగు కిలోమీటర్లే పూర్తి
- ఏడాదిన్నరగా వాహనదారుల అవస్థలు



నందగోకుల్ గ్రామం వద్ద రోడ్డుపై పరిచిన కంకర

నిజాంపేట మండలం చల్మెడ కమాన్ నుంచి నందగోకుల్, నస్కల్ మీదుగా రాంపూర్, నిజాంపేట వరకు 18 కిలోమీటర్లు ఉంటుంది. గతంలో నిర్మించిన తారురోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో కొత్త రోడ్డు నిర్మాణానికి గతంలో రూ. 12.20 కోట్లు మంజూరయ్యాయి. గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డుపై కంకరపరిచి వదిలేశారు. దీంతో గత ఏడాదిన్నర కాలంగా కంకర రోడ్డుపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులపాలవుతున్నారు. పలువురు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. వాహనాలకు సైతం తరచూ రిపేర్లు రావడం నిత్యకృత్యంగా మారింది. ఈ రహదారి కామారెడ్డి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు అనుసంధానం కావడంతో జిల్లావాసులతో పాటు ఆయా జిల్లాలకు చెందిన ప్రయాణికులు తరచూ ప్రయాణిస్తుంటారు. నెలల తరబడి కంకర పరిచిన రోడ్డుపై ప్రయాణించడం కష్టసాధ్యం కావడంతో నస్కల్ గ్రామస్తులు తారు రోడ్డు పనులు ప్రారంభించాలని పలుమార్లు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. దీంతో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చొరవ తీసుకొని సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించేలా చొరవ చూపారు. కాగా కాంట్రాక్టర్ నిజాంపేట నుంచి కేవలం నాలుగు కిలోమీటర్ల మేర.. నస్కల్ వరకు మాత్రమే తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి వదిలేశాడు. నస్కల్ గ్రామస్తులకు ఊరట లభించినా, చల్మెడ, రాంపూర్, నందగోకుల్ గ్రామాల ప్రజల కష్టాలు మాత్రం తీరలేదు. వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే ఆందోళన చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు.

పనులు ప్రారంభించేలా చర్యలు



నిజాంపేట నుంచి రాంపూర్, నస్కల్, నందగోకుల్, చల్మెడ మీదుగా కమాన్ వరకు తారు రోడ్డు నిర్మాణానికి గతంలో రూ. 12.20 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ కంకర తొక్కించి పనులు ఆపివేయగా, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జోక్యం చేసుకోవడంతో నాలుగు కిలోమీటర్ల మేర పూర్తయింది. మిగితా పనిని త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– సర్దార్‌సింగ్, ఈఈ, రోడ్డు భవనాల శాఖ

సర్కారు కాలేజీల్లో సార్లు లేరు

- వేధిస్తున్న లెక్చరర్ల కొరత
- జిల్లావ్యాప్తంగా 28 ఖాళీలు
- సరైన బోధన లేక పడిపోతున్న ఉత్తీర్ణత శాతం



మెదక్ ఇంటర్మీడియెట్ కళాశాల

మెదక్‌జోన్: నిరుపేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ కాలేజీల్లో అధ్యాపకులు కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది కొరతతో నిరుపేద విద్యార్థుల చదువులు ముందుకు సాగటం లేదు. ఫలితంగా ఏటా ఫలితాల్లో జిల్లా అట్టడుగు స్థాయికే పరిమితం అవుతోంది.

16 కాలేజీలు.. 5,417 మంది విద్యార్థులు

జిల్లావ్యాప్తంగా 16 ప్రభుత్వ కళాశాలలు ఉండగా, వాటిలో 5,417 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరంలో 3,031 మంది విద్యార్థులుండగా వీరి సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 2,386 మంది ఉన్నారు. కాగా, 16 కాలేజీల్లో మొత్తంగా పలు రకాల సబ్జెక్టులకు సంబంధించి 12 మంది లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉండగా, కళాశాలకో వ్యాయామ ఉపాధ్యాయుడు (పీడీ) చొప్పున 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్నేళ్లుగా కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో బోధించే గెస్ట్ లెక్చరర్లను ప్రభుత్వం గతేడాది క్రమబద్ధీకరించడంతో వారు విధులు నిర్వర్తించే చోటనే పర్మనెంట్ అయ్యారు. దీంతో కొంతమేర ఖాళీల కొరత తీరినప్పటికీ పూర్తిస్థాయిలో మాత్రం అధ్యాపకుల కొరత సమస్య తీరలేదు. సబ్జెక్టుల వారీగా లెక్చరర్లు లేకపోవటంతో విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో చేరుతున్నారు. దీంతో ఏటా ప్రభుత్వ కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. ఇప్పటికైనా ఇంటర్ విద్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి ఖాళీల కొరతను వెంటనే భర్తీ చేసి పేద విద్యార్థుల భవిష్యత్తును చక్కబెట్టాల్సిన బాధ్యత ఉందని పలువురు కోరుతున్నారు.

ఏటా ఫలితాల్లో వెనకబాటే..

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మెదక్ జిల్లా ప్రతీఏటా వెనకబడుతోంది. 2023, 2024 సంవత్సరాల్లో అట్టడుగు స్థానంలో నిలవగా ఈ ఏడాది సైతం ఫస్టియర్ ఫలితాల్లో చివరిస్థానం (33వ స్థానం)కు పరిమితమైంది. సెకండియర్‌లో మాత్రం 29వ స్థానంలో నిలిచింది.

త్వరలో గెస్ట్ ఫ్యాకల్టీ



కాలేజీల్లో 12 మంది లెక్చరర్ల కొరత ఉంది. త్వరలో గెస్ట్ ఫ్యాకల్టీని ఇవ్వనున్నట్లు ఉన్నతాధికారులు చెప్పారు. జిల్లాలో 16 పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లెక్చరర్ల ద్వారా విద్యార్థులకు వ్యాయామం నేర్పిస్తున్నాం. – మాధవి, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి

బీజేపీకి పంజా గుడ్‌బై

- పార్టీలో బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆరోపణ
- త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్న విజయకుమార్?



రామాయంపేట/నిజాంపేట(మెదక్): జిల్లాలో బీజేపీకి బిగ్‌షాక్ తగిలింది. ఆపార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయకుమార్ బుధవారం రాజీనామా చేశారు. మొదట్లో బీఆర్‌ఎస్ నుంచి నిజాంపేట జెడ్పీటీసీగా గెలుపొందిన ఆయన, ఆపార్టీలో ఇమడలేక గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీలో చేరారు. పార్టీలో బీసీ నాయకుల సహకారంలో ఈటల రాజేందర్ అనుచరుడిగా ముద్రపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ నుంచి బీజేపీ తరఫున పోటీచేసి ఓటమి చెందారు. అనంతరం జరిగిన ఎంపీ ఎన్నికల్లో రఘునందన్‌రావు గెలుపు కోసం శాయశక్తులా కృషి చేశారు. అనతికాలంలోనే బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా 'పంజా' సాక్షితో మాట్లాడారు. పార్టీలో బీసీలకు సరైన న్యాయం జరగడం లేదని, నాయకులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వాడుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో తాను సొంత డబ్బులు ఖర్చుపెట్టి పార్టీని ముందుకు నడిపించానని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతం కేవలం మాటలకే పరిమితమైందని, పార్టీలో అగ్రవర్ణాలకే ప్రాధాన్యత దక్కుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్ష పదవి సైతం బీసీలకు కాకుండా అగ్రవర్ణాలకే ఇచ్చారని, పార్టీలో సమన్యాయం ఎక్కడుందని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల శ్రేయస్సును అధిష్టానం ఎంతమాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. తాను ఏ పార్టీలో చేరేది త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పంజా పార్టీని వీడటానికి వారం రోజుల ముందు నుంచి కాంగ్రెస్ నాయకులతో టచ్‌లో ఉన్నారని సమాచారం. ఈమేరకు ఆయన పలుమార్లు ఎమ్మెల్యేను కలిసినట్లు తెలిసింది. రెండు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరడానికి ముహూర్తం ఖరారైనట్లు తెలిసింది.

పాఠశాలకు డుమ్మా కొట్టొద్దు

కలెక్టర్ రాహుల్‌రాజ్



స్కూల్‌కు రాని విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థుల బంగారు భవిష్యత్తు విద్యతోనే సాధ్యమని, పాఠశాలకు డుమ్మా కొట్టకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మండలంలోని దేశ్యా తండా ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో హాజరు పట్టికను పరిశీలించారు. రెండు, మూడు రోజులుగా పాఠశాలకు రాని విద్యార్థుల గురించి ఉపాధ్యాయులతో ఆరా తీశారు. పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు స్వయంగా వెళ్లిన కలెక్టర్ తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థులను పాఠశాలలకు పంపించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులను విద్యాశాఖ కల్పిస్తుందన్నారు. పిల్లలను ఇతర పనులకు తీసుకెళ్లకూడదన్నారు. ఉపాధ్యాయులు ఈ విషయంలో తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు చర్చించాలని ఆదేశించారు. ఆయన వెంట హెచ్‌ఎం ఏగొండ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నేడు మంత్రి వివేక్ రాక

మెదక్ కలెక్టరేట్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నర్సాపూర్ చేరుకొని పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారని చెప్పారు. మధ్యాహ్నం మెదక్ చేరుకొని కలెక్టరేట్‌లో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు

మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాసచారి

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులు ఏకాగ్రతతో చదివినప్పుడే మంచి భవిష్యత్తును పొందగలరని రాష్ట్ర మోడల్ స్కూల్స్ డైరెక్టర్ శ్రీనివాసచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ద్వితీయ సంవత్సరం సీఈసీ విద్యార్థులతో మాట్లాడారు. బైపీసీ, ఎంపీసీ గ్రూపులను మించి మంచి భవిష్యత్తును సీఈసీ ద్వారా పొందవచ్చన్నారు. గ్రూప్–1 ఉద్యోగాలను ఎక్కువగా సీఈసీ విద్యార్థులే సాధిస్తున్నారన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పలు ప్రశ్నలు వేసి వారి ప్రతిభను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంతో పాటు ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీదేవికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఏఎంఓ రవికుమార్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

డీఏఓ దేవ్‌కుమార్



ఆయిల్‌పామ్ మొక్కను నాటుతున్న డీఏఓ దేవ్‌కుమార్, తదితరులు

టేక్మాల్(మెదక్): నీటి వనరులున్న వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పల్వంచ గ్రామంలో పలువురు రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిపామ్ మొక్కలు నాటారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. మిగితా పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ సాగు వల్ల అధిక లాభాలు ఉంటాయన్నారు. ఈ ఏడాది మాత్రమే ఆయిల్‌పాం పంటకు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే టేక్మాల్ రైతు వేదికలో ఫర్టిలైజర్ డీలర్లకు ఈ–పాస్ మిషన్లను అందించారు. ఇందులో పెద్దశంకరంపేట ఏడీఏ రాంప్రసాద్, టెక్నికల్ ఏడీఏ వినయ్‌కుమార్, ఏఓ వందన, ఆయిల్‌పామ్ టెక్నికల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధ్యాపకురాలికి అవార్డు



శిల్పకు అవార్డు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన అధ్యాపకురాలు మలమంచి శిల్ప నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో టాపర్‌గా నిలిచారు. ఇందుకు గాను ఆమెకు మంగళవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బంగారు పతకంతోపాటు అకాడమీ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శిల్ప మాట్లాడుతూ అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఓటే వజ్రాయుధం

- ఏఎస్పీ మహేందర్


విద్యార్థులతో ఏఎస్పీ మహేందర్

హవేళిఘణాపూర్(మెదక్): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని జిల్లా ఏఎస్పీ మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన మాక్‌పోలింగ్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పోలింగ్ శాతం తగ్గుతున్న నేటి తరుణంలో విద్యార్థులు ఇలాంటి కార్యక్రమం ద్వారా ఓటు హక్కుపై కనువిప్పు కలిగించడంపై విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో, హాస్టల్‌లో చదివి అంచెలంచెలుగా ఈ స్థాయికి వచ్చానన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఎంజేపీ ఆర్‌సీవో గౌతమ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సృజన, లైబ్రేరియన్ సంతోశ్, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు మెడికల్ షాపులు, వైన్ షాపులు, ఈసేవా కేంద్రాల, హోటళ్ల వద్దకు వచ్చి డబ్బులు అవసరం ఉన్నాయని కమిషన్ ఆశ చూపి ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసి నగదు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అలాంటివారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద మొత్తంలో డబ్బులు అడిగితే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

కాటేజీ నిర్మాణానికి రూ.15 లక్షల విరాళం


చెక్కు అందజేస్తున్న నవీన్, స్వప్న దంపతులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు బస చేసేందుకు 100 కాటేజీలు నిర్మించేందుకు చేపట్టిన డోనర్ స్కీంకు దాతలు ముందుకొస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని చెప్పల్‌గూడకు చెందిన అందెల నవీన్, స్వప్న దంపతులు కాటేజీ నిర్మాణానికి విరాళంగా రూ.15 లక్షల చెక్కును ఆలయంలో ఏఈవో శ్రీనివాస్‌కు అందజేశారు. దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేయాలని ఏఈవో భక్తులను కోరారు. ఆలయ ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు భాస్కర్, ఉద్యోగులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటాచారి, హైదరాబాద్ యాదవ సంఘం నాయకులు దుర్గయ్య పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ పూర్వప్రధానార్చకుడు మృతి


మల్లప్ప

మల్లన్న ఆలయ పూర్వ ప్రధానార్చకుడు మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో గతంలో ప్రధానార్చకులుగా విధులు నిర్వహించిన పడిగన్నగారి మల్లప్ప(82) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఆలయంలో 50 ఏళ్ల పాటు అర్చకునిగా, ముఖ్య, ప్రధానార్చకునిగా సేవలు అందించి 2009లో పదవీ విరమణ పొందారు. మృతుడి కుటుంబాన్ని ఆలయ అధికారులు, ఉద్యోగులు, అర్చకులు, ఒగ్గు పూజారులు పరామర్శించారు.

అనిల్ హత్యపై దర్యాప్తు ముమ్మరం

- స్వగ్రామం పైతరలో అంత్యక్రియలు
- మండలంలో సీసీ కెమెరాల పరిశీలన
- అనిల్ మొబైల్ ఫోన్ ఆధారంగా విచారణ
- ఆయన అనుచరులను విచారిస్తున్న పోలీసులు!


గ్రామంలో అనిల్ అంత్యక్రియలు

కొల్చారం(నర్సాపూర్): గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో సోమవారం రాత్రి మృత్యువాత పడ్డ మండలంలోని పైతర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మరెల్లి అనిల్ అంత్యక్రియలు బుధవారం ఉదయం స్వగ్రామంలో జరిగాయి. అంత్యక్రియలకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, స్థానికంగా ఉన్న కొందరు నాయకులు తప్పించి మిగతా నాయకులు ఎవరూ హాజరు కాలేదు. గత ఏడాది జూలై 16న పుట్టినరోజు కార్యక్రమం సందర్భంగా తండ్రి చేత కేక్ తినిపించుకొని ఉల్లాసంగా గడిపిన అనిల్, ఇదే రోజున తండ్రి చేత తలకొరివి పెట్టించుకోవడం అంత్యక్రియలకు హాజరైన వారిని కంటతడి పెట్టించింది.

విచారణ వేగవంతం

అనిల్ హత్య ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. బృందాలుగా ఏర్పడ్డ పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు. అంత్యక్రియలకు ముందు ఎస్ఐ మహమ్మద్ గౌస్ అనిల్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అతని మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. కాల్ డేటా ఆధారంగా దర్యాప్తులో ముందుకు సాగుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇంటి నుంచి అనిల్ కారులో బయలుదేరిన సమయం నుంచి హత్య జరిగిన ఘటనా స్థలికి వచ్చిన ప్రదేశం వరకు మండలంలో దారి పొడవున ఉన్న అన్ని సీసీ కెమెరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇదే సమయంలో ఆయన వెంట ప్రతిరోజు తిరిగే స్నేహితులు, అనుచరులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ఇన్‌స్టాగ్రామ్‌లో అనిల్ వీడియోలు వైరల్

మండలంలో ఏ వ్యక్తి మొబైల్‌లో చూసినా అనిల్‌కు సంబంధించిన 'మరెల్లి అనిల్... మౌర్య ' పేరిట ఇన్‌స్టాగ్రామ్‌లో వివిధ సందర్భాల్లో అప్‌లోడ్ చేసిన అతడి వీడియోలు వైరల్‌గా మారాయి.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య


రాజేశం

బెజ్జంకి(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సౌజన్య కథనం మేరకు... గూడెం గ్రామానికి చెందిన ఎగోల్ల రాజేశం(39) గతంలో ఉపాధి కోసం రెండేళ్లు దుబాయి వెళ్లి వచ్చాడు. తరువాత బేగంపేటలో సొంతంగా ఇల్లు నిర్మించుకుని ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన బాకీలకు తోడు ఆటో నడవకపోవడంతో ఇంటి నిర్వహణ ఖర్చులు పెరిగిపోయి అప్పులయ్యాయి. వాటిని తీర్చ మార్గంలేక బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం తన ఆటోలో ఇంటి నుంచి వెళ్లాడు. క్రిమిసంహారక మందు తాగి బంధువులకు సమాచారమిచ్చాడు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య భాగ్యలక్ష్మి, కూతుర్లు నిహారిక, హర్షితలున్నారు. అన్న మల్లేశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చదువు మానేయాలన్నందుకు బాలిక


మదిహా

రామాయంపేట, నిజాంపేట(మెదక్): కూతురును చదువు మానేయాలని తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడింది. నిజాంపేట పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన మహమ్మద్ సులేమాన్, హమీద దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ సులేమాన్ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండో కూతురు మదిహా(15) పదో తరగతి పాసైంది. కామారెడ్డి మైనారిటీ కళాశాలలో ఇంటర్ సీట్ వచ్చింది. ఆర్థిక పరిస్థితి బాగాలేదని, చదువు వద్దని పలుమార్లు ఆమె తల్లిదండ్రులు ఆమెను మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన మదిహా బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి రిమాండ్

ములుగు(గజ్వేల్): గంజాయి విక్రయిస్తున్న యువకున్ని అరెస్టు చేశామని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం... ములుగులోని మధువన్ వెంచర్ వద్ద యువకుడు గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఎస్ఐ విజయ్‌కుమార్, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి రైడ్ చేశారు. రైడ్‌లో ములుగుకు చెందిన మణికంఠ అనే యువకుడు పట్టుబడ్డాడు. అతని వద్ద 130 గ్రాముల గంజాయితో పాటు సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకొని, గజ్వేల్ కోర్టుకు రిమాండ్‌కు తరలించారు.

రోడ్డుపై పడిన చెట్టును ఢీకొట్టి.. వ్యక్తి మృతి

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మర్పడ్గ గ్రామానికి చెందిన కొండూరి కిషన్ (30) 14వ తేదీన కూలీ పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై అంకిరెడ్డిపల్లికి వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తున్న క్రమంలో టోల్ ప్లాజా నుంచి మల్లన్న సాగర్‌కు వెళ్లే రోడ్డు మార్గం గుండా వస్తుండగా దుద్దెడ శివారులో పెద్ది శంకరయ్య వ్యవసాయ భూమి వద్ద రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న పెద్ద చెట్టును ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంటటంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య కల్పన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగి..

వట్‌పల్లి(అందోల్): పురుగుల మందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలో ఖాదిరాబాద్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ లవకుమార్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చాకలి యాదయ్య(47) కొంత కాలంగా దగ్గు, దమ్ము వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో భరించలేక ఈ నెల 11న రాత్రి 12.30 గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబీకులు జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టాస్క్‌లు, కమీషన్ల పేరుతో సైబర్ మోసం

రూ.8 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేట్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సబర్ వలలో చిక్కి ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.8 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్ తండాకు చెందిన ప్రైవేట్ ఉద్యోగికి జూన్ 25న మెసేజ్ వచ్చింది. దానికి స్పందించి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి నగదు చెల్లించి టాస్కులు చేయడం మొదలు పెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.8 లక్షలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్, అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీధి కుక్కల దాడి

- పలువురికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఒకే రోజు గ్రామానికి చెందిన వంజరి నర్సయ్య, వరలక్ష్మి, అనిత, మహేష్‌పై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటుకు గురైన వారు చికిత్స చేయించుకున్నారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పనిచేస్తున్న చోటే సర్దుబాటు చేయాలి

మెదక్ కలెక్టరేట్: ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు తరలించకుండా పనిచేస్తున్న చోటే వర్క్ సర్దుబాటు చేయాలని ఎస్జీటీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మెదక్ డీఈఓ రాధాకిషన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 20లోపు విద్యార్థులున్న చోట ఇద్దరు, 40లోపు విద్యార్థులున్న పాఠశాలల్లో ముగ్గురు, 60 లోపు విద్యార్థులుంటే 4మంది, 60 దాటితే తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని, వందమంది దాటితే ఆ పాఠశాలకు నిబంధనలు పెట్టకుండా తరగతి గదికి ఉపాధ్యాయుడితో పాటు హెచ్‌ఎంను కూడా నియమించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జింక అశోక్, జగన్, నాయకులు దశరథం, గణేష్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం


వెలమకన్నె నవీన్

నర్సాపూర్ రూరల్: యువకుడు అదృశ్యమైన ఘటన మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెలమకన్నె నవీన్(26) నర్సాపూర్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. కాగా ఈనెల 14న బంకు వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో అతడి ఫోన్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. నవీన్ అన్న జగన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తొమ్మిది నెలల గర్భిణి ..

పటాన్‌చెరు టౌన్: తొమ్మిది నెలల గర్భిణి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన పప్పుసింగ్ భార్య పూజాబాయితో కలిసి బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్ తండాకు వచ్చారు. గుడిసె వేసుకొని ఆయుర్వేదిక్ మందులను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పూజాభాయి 15వ తేదీన తెల్లవారుజామున ఎరుపు రంగు కారులో వెళ్లిందని స్థానికులు చెప్పడంతో భర్త వెళ్లి చూడగా కారు కనిపించలేదు. చుట్టు ప్రక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పథకాల అమలుపై ఆరా


గౌతోజీగూడెంలో కేంద్ర బృందం

మనోహరాబాద్(తూప్రాన్): జాతీయ స్థాయి పర్యవేక్షణలో భాగంగా కేంద్ర పథకాలు రాష్ట్రంలో ఎలా అమలవుతున్నాయి? తదితర అంశాలపై జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ బృందం బుధవారం గౌతోజీగూడెంను సందర్శించింది. ఈ సందర్భంగా బృంద సభ్యులు సురంజనరెడ్డి టీం, మెంబర్లు సాధ్విక్ అలీ గ్రామ పంచాయతీలో పలు రికార్డులను పరిశీలించారు. కేంద్ర పెన్షన్లు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాల పనితీరు, ఈజీఎస్ జాబ్‌కార్డుల వెరిఫికేషన్, సడక్ యోజన, గ్రామ పంచాయతీల తీరు, లబ్ధిదారులు తదితర అంశాలపై తనిఖీ చేశారు. వీరి వెంట పీఆర్ డీఈ విజయ్‌ప్రకాష్, డీఆర్డీఏ హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ స్మైలీ, ఏపీఓ ఆదినారాయణ, ఈసీ లక్ష్మీనారాయణ, ఏపీఎం పెంటాగౌడ్, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, టీఏ జగపతి, మాజీ ఉప సర్పంచ్ రేణుకుమార్ తదితరులున్నారు.

భూ సమస్య పరిష్కరించాలని రైతు నిరసన

- నివేదిక తప్పుగా పంపించారని ఆగ్రహం
- న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న తండ్రీకొడుకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ సమస్యను పరిష్కరించాలని తండ్రీకొడుకులు నిరసన చేపట్టారు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన చిల్వూరి ఎల్లారెడ్డి, అతని కుమారుడు మహేందర్‌రెడ్డి భూ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు చాలా రోజులుగా విజ్ఞప్తి చేస్తున్నారు. అయినా సమస్యను పరిష్కరించకుండా తీవ్ర ఆలస్యం చేస్తున్నారని బుధవారం తండ్రి, కొడుకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైసా పైసా కూడ బెట్టుకొని కొనుగోలు చేసిన 20 ఎకరాల భూమిని సాగు చేస్తూ వస్తున్నామని తెలిపారు. ఎవరో చెప్పారని ఆ భూమిని ఆన్‌లైన్‌లో కనిపించకుండా రెవెన్యూ అధికారులు తొలగించారని కంటతడి పెట్టుకున్నారు.

విషయం రైతు కమిషన్ చైర్మన్ వద్దకు..

ఇటీవల సిద్దిపేట జిల్లా ప్రజావాణిలో భూ బాధితుడు ఎల్లారెడ్డి భూ సమస్యతో విసుగొచ్చి ఓ కవర్‌లో డీజిల్‌ను వెంట తీసుకొని వెళ్లాడు. గమనించిన పోలీసులు అడ్డుకొని బయటకు పంపించారు. ఈ క్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి భూ బాధితుడు ఎల్లారెడ్డి, తహసీల్దార్ అనంతరెడ్డిలను హైదరాబాద్‌కు పిలిపించుకొని మాట్లాడి భూ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అయినా భూ సమస్యను పరిష్కరించకుండా ఉన్నతాధికారులకు నివేదికను తప్పుగా పంపించారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. న్యాయం జరగకపోతే తమ కుటుంబానికి ఆత్మహత్యే శరణ్యమని కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయంపై తహసీల్దార్ అనంతరెడ్డిని వివరణ కోరగా... భూ సమస్యపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించామని, రైతు అడిగిన సమాచారాన్ని ఇచ్చామని తెలిపారు. భూ వివాదం కోర్టు కేసులో ఉందని, ఈ విషయంలో మేము ఏం చేయలేమని చెప్పారు.

జర్నలిస్టు కుటుంబంపై దాడి

- కేసు నమోదు
- ఖండించిన జర్నలిస్టు సంఘాలు

సదాశివపేట (సంగారెడ్డి): జర్నలిస్టు కుటుంబంపై దాడి జరిగింది. కొంత మంది దుండగులు ఇంట్లో చొరబడి నానా బీభత్సం సృష్టించారు. విచక్షణా రహితంగా కొట్టారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల వివరాల ప్రకారం... సిద్ధాపూర్ గ్రామానికి చెందిన సదాశివపేట ప్రింట్ మీడియా అధ్యక్షుడు, సాక్షి విలేకరి వెంకటేశం గౌడ్, విజయలక్ష్మి దంపతులకు కుమారుడు శివమణి గౌడ్ ఉన్నాడు. అయితే స్థానిక సున్నం కిరణ్ , సున్నం నరేష్‌ల మేనకోడలిని శివమణి గౌడ్ ప్రేమించాడని ఈ నెల 11న అర్ధరాత్రి అతడి కుటుంబ సభ్యులపై కత్తులతో కిరాతకంగా దాడి చేశారు. అడ్డుకోబోయిన వారిని కూడా వదలలేదు. కొందరు వ్యక్తులు మారణాయుధాలతో బీభత్సం సృష్టించి చంపుతామని బెదిరించారు. ఈ విషయమై ఐదు రోజుల క్రితం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా జర్నలిస్టు కుటుంబంపై దాడికి దిగిన సున్నం నరేష్ అతడి అనుచరులపై చర్యలు తీసుకోవాలని పేట ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘాల నేతలు స్థానిక సీఐకి వినతి పత్రం అందజేసి, దాడిని ఖండించారు.

జనం కోసమే కమ్యూనిస్టు పార్టీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివ రావు


ర్యాలీగా వస్తున్న కూనంనేని సాంబశివ రావు, చాడ వెంకట్ రెడ్డి, కార్యకర్తలు

హుస్నాబాద్ : జనం కోసమే కమ్యూనిస్టు పార్టీ పుట్టిందని, త్యాగ గుణం ఉన్న వారే ఈ పార్టీలో ఉంటారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో సీపీఐ జిల్లా 4వ మహాసభలు నిర్వహించారు. అంతకుముందు అంబేడ్కర్ చౌరస్తా నుంచి గార్డెన్ వరకు డప్పు చప్పుళ్లతో సీపీఐ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివ రావు మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ ఉద్యమ చరిత్రలో కమ్యూనిస్టులు లేని పేజీ అంటూ ఉండదన్నారు. అడవిలో ఉండి ప్రజల కోసం పని చేసే మావోయిస్టులను కాల్చి చంపడం సరికాదన్నారు. కమ్యూనిస్టులన్నా, ఎర్ర తిలకం అన్న బీజేపీకి భయమన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయకుండా విస్మరించారన్నారు. కట్టను పూర్తి చేసి కాలువలను తవ్వలేదన్నారు. కమ్యూనిస్టులను ఏరివేయాలని మోదీ ప్రయత్నిస్తున్నాడని, ప్రశ్నించే గొంతుకలు ప్రజాస్వామ్యంలో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శంకర్, జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శంకర్, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మల్లేశ్, నాయకులు వెంకట్రాం రెడ్డి, సత్యనారాయణ, వనేష్, కొమురయ్య, లక్ష్మణ్, జనార్దన్, రాజ్‌కుమార్, పద్మ ఉన్నారు.

ఇసుక అక్రమ డంప్ సీజ్


ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌పై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. మండల కేంద్రానికి చెందిన మిడిమలుపుల సాంబరాజు ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ చేసిన 120టన్నుల అక్రమ ఇసుక డంప్‌ను బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ చాతరాజు ప్రశాంత్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను డంప్ చేసి ఎక్కువ ధరకు అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు నిర్వహించి ఇసుక డంప్, ట్రాక్టర్‌ను సీజ్ చేశామని తెలిపారు. కానిస్టేబుల్ రాజ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు కత్తెర పురుగు

ఆదిలోనే చీడపీడలతో పంటలకు నష్టం

- మందులు పిచికారీ చేసినా చావని పురుగు
- ఆందోళన చెందుతున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయ అధికారులు


ఈ ఫొటోలో కన్పించే మహిళా రైతు పొన్నబోయిన చిలుకవ్వ మీర్జాపూర్‌లో రెండెకరాల్లో మొక్కజొన్న, ఎకరంలో కూరగాయలు సాగు చేస్తుంది. మరో ఎకరం వరి సాగుకు నారు పోసి సిద్ధం చేసింది. మొక్కజొన్న చేనుకు కత్తెర పురుగు (మొగ్గి) రావడంతో తీరొక్క మందులు తెచ్చి పిచికారీ చేసిన పురుగు పోకపోవడంతో ఆమె ఆందోళన చెందుతుంది.


మీర్జాపూర్‌లో కత్తెర పురుగు తినేసిన రైతు రాములు మొక్కజొన్న చేను

హుస్నాబాద్‌రూరల్: ఆశించిన వర్షాలు లేకపోవడంతో మెట్ట రైతులు ఆరుతడి పంట మొక్కజొన్న వైపు మొగ్గు చూపారు. హుస్నాబాద్ డివిజన్ అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్, బెజ్జంకి మండలాల్లో 3వేల పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు. వానలు పడితే పంటను మార్చి యాసంగిలో వరి పెట్టాలనే ఆలోచనతో సాగు చేశారు. కానీ వర్షాలు లేక సాగు నీటి సమస్యను ఎదుర్కొంటున్న రైతన్నలకు కత్తెర పురుగు సమస్య ' మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు అయింది. మొక్క మొదలు నుంచి కంకి వచ్చే వరకు పురుగు కర్రను తినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మక్క కంకులు పూర్తి దశకు రాకముందే కర్రలు విరిగిపోయే అవకాశం ఉండటంతో వ్యవసాయ అధికారుల సలహాల కోసం ఎదురు చూస్తున్నారు.

రైతుకు ఎరువు బరువు..

వ్యవసాయ అధికారులు రైతులకు ఎకరాకు ఒక యూరియా బస్తా ఇవ్వాలని నిబంధన పెట్టడంతో ఎరువు బరువుగా మారింది. రసాయన మందులను పిచికారీ చేసి పచ్చదనం కోసం యూరియాకు వెళ్తే ఎరువుల దుకాణ యాజమానులు లేవంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పంటల దగ్గరకు వ్యవసాయ అధికారులు రావడం లేదని, పంటలకు సోకే తెగుళ్లపై సలహాలు, సూచనలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ఎరువుల దుకాణం యాజమానులు యూరియా బస్తాలకు నిబంధనలు పెట్టడంతో నష్టపోతున్నామని తెలిపారు.

అధికారులు పరిశీలించాలి



సాగు నీరు లేదు, వానలు పడక ఆరుతడి పంట మొక్కజొన్న సాగు చేసినం. వరి పెడితే బాయిల ఊట నీరు లేకపాయే. మక్క పెడితే కత్తెర పురుగు రావట్టే. ఏ మందులు కొట్టినా పురుగు పోతలేదు. వ్యవసాయ అధికారులు పంట చేన్లకు వచ్చి తెగుళ్లపై సూచనలు, సలహాలు ఇస్తే పాటిస్తం. ఇప్పటి వరకు ఒక అధికారి కూడా రాలేదు. రైతులకు కావల్సిన యూరియాను షరతులు లేకుండా ఇయ్యాలి.

– రాంగోపాల్‌రావు, రైతు, గాంధీనగర్